క్లుప్తంగా

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

చింతలనర్వ(గంపలగూడెం): మండలంలోని చింతలనర్వ సచివాయం పరిధిలోని చెన్నవరంలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వై పిచ్చిరెడ్డి తెలిపారు. ఉదయం ఏడు గంటల నుంచి నిర్వహించే కార్యక్రమంలో తిరువూరు ఎమ్మెల్యే కే రక్షణనిధి పాల్గొని ప్రభుత్వ అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తారని పేర్కొన్నారు. కాగా వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేశ్వరరావు కోరారు.

నోట్ పుస్తకాల సరఫరా



గంపలగూడెం: జగనన్న విద్యా కానుక–4లో భాగంగా వచ్చే విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించే విద్యార్థులకు సరఫరా చేయాల్సిన నోట్ పుస్తకాలను ఉన్నతాధికారులు శుక్రవారం గంపలగూడెం మండలానికి సరఫరా చేశారు. 30,352 నోట్ పుస్తకాలు సరఫరా కాగా గంపలగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో దిగుమతి చేసుకున్నట్లు ఎంఈఓ బి.సోమశేఖర్ నాయక్ తెలిపారు. వీటిని 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు విద్యా సంవత్సరం ప్రారంభం కాగానే పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. కాంప్లెక్స్ హెడ్ మాస్టర్ ఎస్.జమలయ్య పాల్గొన్నారు.

పచ్చిరొట్ట విత్తనాలు సిద్ధం

తిరువూరు: ఖరీఫ్ సీజన్లో భూసారం పెంపునకు అవసరమైన పచ్చిరొట్ట విత్తనాలు సిద్ధంగా ఉన్నట్లు తిరువూరు సహాయ వ్యవసాయ సంచాలకులు కెనడీ తెలిపారు. స్థానిక వ్యవసాయ శాఖాధికారి కార్యాలయంలో శుక్రవారం వ్యవసాయ సలహా మండలి సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 50శాతం సబ్సిడీపై క్వింటా ధర రూ.3,950కి పచ్చిరొట్ట విత్తనాలను రైతులు ఆర్బీకేలలో పొందవచ్చని తెలిపారు. రైతుభరోసా పథకానికి అర్హుల జాబితాను ఈ నెల 15 నుంచి ఆర్బీకేలలో అందుబాటులో ఉంచుతామన్నారు. ఏవైనా లోపాలుంటే తెలియజేయవచ్చని సూచించారు. సలహా మండలి అధ్యక్షుడు సీతారామయ్య, మండల వ్యవసాయాధికారి పద్మ పాల్గొన్నారు.

ప్రతి ఆడబిడ్డకు భరోసా

చాట్రాయి: ఆడ బిడ్డ పుట్టినప్పటి నుంచి జీవితంలో స్థిరపడే వరకు వివిధ దశల్లో సహాయ సహకారాలు అందించేందుకు ప్రభుత్వ చిన్నారి భవిత పథకాన్ని అమలుచేస్తోందని చాట్రాయి మండలం చిన్నంపేట గ్రామ సర్పంచ్ పరసా ధనలక్ష్మి అన్నారు. శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన చిన్నారి భవిత కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. పాపకు కిట్, పుట్టిన తేదీ సర్టిఫికేట్ అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ పరసా చెన్నారావు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నిర్మల జ్యోతి, ఏఎన్ఎం, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. జనార్ధనవరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీటీసీ పోతురెడ్డిపల్లి కృష్ణ పాల్గొన్నారు.

రేపు హనుమజ్జయంతి

నూజివీడు: స్థానిక హనుమాన్ జంక్షన్ రోడ్డులో ఉన్న శ్రీ మారుతి ఆనంద నిలయం(మఠం) 14వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 14న హనుమజ్జయంతి మహోత్సవాలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆదివారం స్వామికి విశేష పూజల అనంతరం మధ్యాహ్నం 12 గంటల నుంచి అన్నదానం ఉంటుందని పేర్కొన్నారు.

మైలవరంలో..

మైలవరం: మైలవరంలోని కోదండ రామాలయంలో ఆదివారం హనుమజ్జయంతి సందర్భంగా ఉదయం ఆరు గంటలకు హనుమాన్ చాలీసా పారాయణం 108 సార్లు జరుగుతుందని దేవాలయం కమిటీ అధ్యక్షుడు మణికొండ చిన్న వెంకటేశ్వరరావు తెలిపారు. స్వామికి ప్రత్యేకంగా తమలపాకుల పూజ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

జై హనుమాన్ శోభాయాత్రను విజయవంతం చేయాలి



గంపలగూడెం: హనుమజ్జయంతి సందర్భంగా ఈ నెల 14వ తేదీన నిర్వహించనున్న జై హనుమాన్ శోభాయాత్రను విజయవంతం చేయాలని కోరుతూ భక్తులు కరపత్రాలను పంపిణీ చేశారు. హిందు సంఘం, హనుమాన్ భక్త బృందం ఆధ్వర్యంలో గంపలగూడెం, తోటమూల్లో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు.

ప్రజలకు మంచి చేయడమే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే రక్షణనిధి



చింతలనర్వలో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే రక్షణనిధి

చింతలనర్వ(గంపలగూడెం): ప్రజలకు మంచి చేయడమే లక్ష్యంగా రాష్ట్రంలో నాలుగు సంవత్సరాలుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సుపరిపాలన సాగిస్తోందని తిరువూరు ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి తెలిపారు. గంపలగూడెం మండలం చింతలనర్వలో గ్రామస్తులకు ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను వివరిస్తూ శుక్రవారం గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన కొనసాగించారు . గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఇప్పటి వరకు ఆయా కుటుంబాలకు వివిధ సంక్షేమ పథకాల ద్వారా చేకూరిన ప్రయోజనం తెలియజేశారు. వివరాలతో కూడిన కరపత్రాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. గ్రామస్తులకు ఏమైనా సమస్యలను ఉన్నాయా? అని అడిగి తెల్సుకున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి పేదవానికి సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరిందన్నారు. ఈ పథకాలు ఇలాగా కొనసాగాలంటే 2024 ఎన్నికల్లో ఓటర్లు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోమారు బలపర్చాలన్నారు. గ్రామంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాల ద్వారా రూ.4.98కోట్లు, అభివృద్ధి పథకాల ద్వారా రూ. 1.16 కోట్లు గ్రామంలో ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు. గ్రామస్తుల విజ్ఞప్తి మేర మెరుగైన విద్యుత్ సరఫరాకు అవసరమైనన్ని విద్యుత్ పోల్సు ఏర్పాటు చేస్తామని తెలిపారు. సచివాలయం నిధులతో ప్రాధాన్యతా క్రమంలో అంతర్గత రహదార్లలో సిమెంట్ రోడ్లు నిర్మిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఎంపీపీ గోగులమూడి శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు కోట శ్యామూల్, సర్పంచ్ జాన్‌కోటయ్య, ఎంపీటీసీ సభ్యురాలు మేరీకాంతి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు చెన్నకేశవరెడ్డి, నర్సారెడ్డి, కృష్ణయ్య, ఉమా, మాజీ ఎంపీపీ దాసు, నాయకులు ప్రేమరాజు, వీరస్వామి, కోటేశ్వరరావు, రాంబాబు, లక్ష్మీనారాయణ, బాలు, ఆంజనేయులు పాల్గొన్నారు.

కృష్ణామిల్క్ యూనియన్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



గోల్డ్ కాయిన్ అందజేస్తున్న సాంబ శివమూర్తి

రెడ్డిగూడెం: కృష్ణామిల్క్ యూనియన్ అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని తిరువూరు కృష్ణామిల్క్ యూనియన్ కేంద్రం మేనేజర్ టి. సాంబశివమూర్తి అన్నారు. రెడ్డిగూడెం మండలం మద్దులపర్వ గ్రామంలో పాల సంఘం నందు కృష్ణా మిల్క్ యూనియన్ ఆధ్వర్యంలో కల్యాణమస్తు పథకం శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా పాల కేంద్రంలో సంఘ సభ్యులైన కోమటి వెంకటరమణ కుమారుడు గోపి వివాహం సందర్భంగా రూ. 20 వేలు విలువజేసే గోల్డ్ కాయిన్‌ను తిరువూరు పాల శీతల కేంద్రం మేనేజర్ టి.సాంబ శివమూర్తి అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ట్రస్ట్ బోర్డు డైరెక్టర్, సంఘ అధ్యక్షురాలు ముక్కాల విజయలక్ష్మి పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి

జెడ్పీటీసీ సభ్యుడు భూక్య గనియా



మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు భూక్య గనియా

ఏ.కొండూరు: ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లి అవగాహన కల్పించాలని జెడ్పీటీసీ సభ్యుడు భూక్య గనియా పేర్కొన్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతున్నారని, వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకునే విధంగా అవగాహన కల్పించాలన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తిరువూరు పర్యటనలో జగనన్న విద్యా దీవెన కార్యక్రమాన్ని ప్రారంభించేందుక వచ్చినప్పుడు మండలానికి కాలనీ గృహాలు మంజూరు చేయాలని స్థానిక ఎమ్మెల్యే కే రక్షణనిధి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారని పేర్కొన్నారు. ఆయన వెంటనే స్పందించి కాలనీ గృహాలు అవసరమైన వారందరికీ మంజూరు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించి ఉన్నారని తెలిపారు. త్వరలో కాలనీ గృహాలు మంజూరవుతాయన్నారు. గృహాలు నిర్మించుకునేందుకు అవసరమైన సర్టిఫికెట్లు సంబంధిత అధికారులు వెంటనే మంజూరు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ నాగలక్ష్మి, వైస్ ఎంపీపీ సిద్ధం పద్మ, ఎంపీడీఓ నాగేశ్వరరావు, తహసీల్దార్ చాట్ల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కోలాటం ప్రదర్శనలు



మేడూరులో కోలాటం ప్రదర్శిస్తున్న మహిళలు

మేడూరు(గంపలగూడెం): మేడూరు వీరాంజనేయ స్వామి ఆలయంలో హనుమజ్జయంతి సందర్భంగా మూడు రోజుల పాటు నిర్వహించనున్న కోలాటం ప్రదర్శన పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఆలయ కమిటీ చైర్మన్ ముత్యాల రామకృష్ణ పోటీలను ప్రారంభించారు. మొదటిరోజు వివిధ ప్రాంతాల నుంచి ఏడుకోలాటం బృందాల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

క్రీడలతో మానసిక వికాసం



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ప్రతాప్‌రెడ్డి

ఆగిరిపల్లి: క్రీడలు మానసిక ఉల్లాసానికి, మనో వికాసానికి దోహదపడతాయని ఎస్‌సీఆర్‌టీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ బి.ప్రతాప్‌రెడ్డి అన్నారు. ఆగిరిపల్లి మండలం తోటపల్లి హీల్ స్కూల్‌లో నిర్వహించిన సమ్మర్ క్యాంప్ ముగింపు కార్యక్రమం ప్రతాప్‌రెడ్డి మాట్లాడారు. అనాథ బాలల కోసం కృషి చేస్తున్న హీల్ సేవలు అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. హీల్ అంధ విద్యార్థులు చేసిన నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ఇంటర్న్‌షిప్ అధికారి మహేశ్వర్ ద్వివేది, హైదరాబాద్ యూనివర్సిటీ విశ్రాంత ప్రధానాధికారి జి.భువనేశ్వరి లక్ష్మి, హీల్ కార్యదర్శి టి.లక్ష్మి, ఫెసిలిటీస్ డైరెక్టర్ భాస్కర్, సీఈఓ అజయ్‌కుమార్, హీల్ ప్రిన్సిపల్ సాయి బాబు పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు కృషి



తిరువూరు మెప్మా అర్బన్ మార్కెట్‌ను సందర్శించిన చైర్‌పర్సన్

తిరువూరు: మహిళలు స్వయం సమృద్ధి సాధించేందుకు, జీవనోపాధి మెరుగుపరచుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం పలు కార్యక్రమాలు చేపడుతోందని తిరువూరు నగర పంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరి బాయి అన్నారు. స్థానిక ప్రభుత్వాస్పత్రి వద్ద మెప్మా సభ్యులైన మహిళలు ఏర్పాటు చేసిన అర్బన్ మార్కెట్‌ను శుక్రవారం సందర్శించిన ఆమె పొదుపు సంఘాల పనితీరును ప్రశంసించారు. గ్రూపులుగా ఏర్పడి మహిళలు మంచి వ్యాపారవేత్తలుగా రాణించాలని, వినూత్న ఆలోచనలతో మంచి పేరు ప్రఖ్యాతులు గడించాలని సూచించారు. కమిషనర్ బాలకృష్ణ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలు

తుమ్మలపాలెం(ఇబ్రహీంపట్నం): మూడు స్కూటీలను లారీ ఢీకొన్న ఘటనలో ఐదుగురు గాయాలపాలయ్యారు. వీరిలో ముగ్గురికి తీవ్రగాయాలు కాగా మిగిలిన ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. మండలంలోని తుమ్మలపాలెం వద్ద 65వ నంబర్ జాతీయ రహదారిపై శుక్రవారం ప్రమాదం జరిగింది. ఇబ్రహీంపట్నం వైపు నుంచి గుంటుపల్లి వైపు మూడు స్కూటీలపై ఐదుగురు వెళుతున్న సమయంలో వెనుక వైపు నుంచి వచ్చిన లారీ అదుపుతప్పి మూడు స్కూటీలను వరుసగా ఢీకొట్టింది. ప్రమాదంలో మూలపాడు గ్రామానికి చెందిన నళిని, గుంటుపల్లికి చెందిన కృష్ణవేణి, జానేష్‌కు తీవ్రగాయాలయ్యాయి. మిగిలిన ఇద్దరు స్వల్పంగా గాయపడ్డారు. క్షతగాత్రులను 108 వాహనంలో వైద్యశాలకు తరలించారు. పోలీసులు లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు చేపట్టారు.

కంప్యూటర్ టెక్నాలజీపై అవగాహన ఉండాలి

మైలవరం: కంప్యూటర్ టెక్నాలజీపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి తెలిపారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పదో తరగతి, ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థులకు కంప్యూటర్ విద్యపై అవగాహన, ఆసక్తి కల్పించేందుకు వేసవి శిక్షణ శిబిరం శుక్రవారం ప్రారంభించి ప్రసంగించారు. కళాశాల ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరాలను నిర్వహిస్తోందన్నారు. అధునాతన కంప్యూటర్స్ ల్యాబ్స్, డిజిటల్ క్లాస్ రూమ్‌లో నిపుణులైన అధ్యాపకులతో కంప్యూటర్స్ మౌలిక సూత్రాలు ల్యాప్‌టాప్స్‌పై 50 మంది విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.

పంట నష్టాన్ని అంచనా వేయాలి



జి.కొండూరు: మండల పరిధిలో గురువారం రాత్రి ఈదురుగాలులతో కురిసిన అకాల వర్షానికి నష్టపోయిన పంటలను గుర్తించి రైతులకు నష్ట పరిహారం అందేలా చూడాలని ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ అన్నారు. స్థానిక ఏఓ కార్యాలయంలో మండల వ్యవసాయ సలహా మండలి సమావేశాన్ని అధ్యక్షుడు జమ్ముల హనుమంతురావు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ రాంకుమార్ మాట్లాడుతూ గురువారం రాత్రి కురిసిన అకాల వర్షానికి బొప్పాయి, మునగ పంటలకు 30శాతం వరకు నష్టం జరిగినట్లు చెప్పారు.

ఐటీఐలో చేరేందుకు దరఖాస్తు చేసుకోండి

నూజివీడు: స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో 2023–24 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు పదో తరగతి ఉత్తీర్ణులైన, ఫెయిలయిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని ప్రధానాధికారి దేవరకొండ భూషణం శుక్రవారం తెలిపారు. జూన్ 6వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోపు ఐటీఐ.ఏపీ.జీఓవీ.ఇన్‌లో రిజిస్టర్ చేసుకోవాలని పేర్కొన్నారు.మరిన్ని వివరాలకు 08656 232711లో ఆఫీసు పనివేళల్లో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

గాలి, వర్షానికి తెగిపడిన విద్యుత్ తీగలు

మైలవరం: మైలవరంలో గురువారం రాత్రి వీచిన గాలి, వర్షానికి పలు చోట్ల విద్యుత్ స్తంభాలు విరిగి పడ్డాయి. అలాగే రహదారుల్లో చెట్లు విరిగి విద్యుత్ వైర్లపై పడటంతో తీగలు తెగిపోయి, సుమారు నాలుగు గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయమేర్పడింది. స్థానిక ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రిలో గాలి వర్షానికి చెట్లు విరిగి పడిపోవడంతో విద్యుత్ వైర్లు తెగిపడి, విద్యుత్ సరఫరాకు అంతరాయమేర్పడింది. కూలీల సాయంతో పొక్లేన్ ఏర్పాటు చేసి శకలాలు తొలగింపు చర్యలు చేపట్టారు. సర్పంచ్ గరికపాటి మంజుభార్గవి, ఉప సర్పంచ్ చామల సీతారెడ్డి, ప్రజా ప్రతినిధులు పొందుగల రోడ్డు, తారకరామానగర్ తదితర ప్రాంతాలు పర్యటించి విద్యుత్ పునరుద్ధరణ పనులు పర్యవేక్షించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నూజివీడు: విద్యుత్ లైన్ మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏపీసీపీడీసీఎల్ ఈఈ డి.కృష్ణనాయక్ తెలిపారు. పట్టణంలోని ట్రిపుల్‌ఐటీ సబ్‌స్టేషన్ పరిధిలోని గాంధీనగర్, శ్రీనివాస సెంటర్, ధంధంగార్డెన్, గొడుగువారిగూడెం, అన్నవరం, పోతురెడ్డిపల్లి, ముక్కొల్లుపాడు, దిగవల్లి, గుడిపాడు సబ్‌స్టేషన్ల పరిధి గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని ఈఈ విజ్ఞప్తి చేశారు.

తిరువూరు: మండలంలో 33కేవీ విద్యుత్ లైన్లకు అత్యవసర మరమ్మతు పనుల నిమిత్తం శనివారం సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఎస్పీడీసీఎల్ తిరువూరు పట్టణ ఏఈ షఫీ తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి 11.30 వరకు అన్ని గ్రామాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

మొక్కజొన్నను కొనుగోలు కేంద్రాలకు తరలించాలి

ముసునూరు: మొక్కజొన్న పంటను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు తరలించాలని వైస్ ఎంపీపీ కె.రాజానాయన సూచించారు. ముసునూరు మండలం లోపూడి వైఎస్సార్ రైతు భరోసా కేంద్రంలో మండల వ్యవసాయ శాఖాధికారి చేబత్తిన శ్రీనివాస్ అధ్యక్షతన మండల వ్యవసాయ సలహామండలి సమావేశం శుక్రవారం నిర్వహించారు. వైస్ ఎంపీపీ మాట్లాడుతూ చెక్కపల్లి, వలసపల్లి, కొర్లగుంట గ్రామాల పీఏసీఎస్‌ల వద్ద ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను సక్రమంగా వినియోగించుకోవాలని రైతులకు సూచించారు. ఏఓ మాట్లాడుతూ తుపాను ప్రభావం తొలగిన నేపథ్యంలో ఎప్పటికప్పుడు మొక్కజొన్న కొనుగోలుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. మొక్కజొన్న పంట తేమ శాతం 14కు తగ్గేలా జాగ్రత వహించాలన్నారు. అనంతరం కల్లాలపై ఉన్న మొక్కజొన్న పంటను పరిశీలించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పేరం కృష్ణ, ఆదర్శరైతు నరసింహారావు పాల్గొన్నారు.

ఖరీఫ్ వ్యవసాయం కార్యాచరణపై సమావేశం

విస్సన్నపేట: ఖరీఫ్ వ్యవసాయం కార్యాచరణపై వ్యవసాయ సలహామండలి సమావేశం శుక్రవారం స్థానిక ఏఓ కార్యాలయంలో నిర్వహించారు. జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ దోర్నాల దామోదరరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఖరీఫ్ వ్యవసాయంపై పలు అంశాలు చర్చించారు. కార్యక్రమంలో ఏఓ రాజ్యలక్ష్మి, సభ్యుడు కాసర చెన్నారెడ్డి పాల్గొన్నారు.

ఆడపిల్లలను అభివృద్ధి చెందనిద్దాం

సబ్‌కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్



బాలింతకు పోషణ కిట్‌ను అందిస్తోన్న సబ్‌కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్

నూజివీడు: ఆడపిల్లలను సంరక్షించేందుకు, వారికి విద్యా, ఉపాధి అవకాశాలను ప్రభుత్వాలు కల్పిస్తున్నందున తల్లిదండ్రులు బాలికలను అభివృద్ధి చెందనివ్వాలని సబ్‌కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ అన్నారు. బేటీ పడావో..బేటీ బచావో కార్యక్రమంలో భాగంగా స్థానిక సమతానగర్‌లో శుక్రవారం చిన్నారి భవిత కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో, క్రీడల్లో, రాజకీయాల్లో, విద్యా వైద్య రంగాల్లో ఇలా ప్రతి రంగంలోనూ మహిళలు రాణిస్తున్నారని తెలిపారు. బాల్య వివాహాలను నిరోధించడం, వరకట్నాన్ని అరికట్టడం, విద్యను ప్రోత్సహించడం చేయాలన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ వర్కర్లు, వైద్య ఆరోగ్య సిబ్బంది, వార్డు సచివాలయ సిబ్బంది చిన్నారి భవిత కార్యక్రమంపై విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఆడశిశువులకు జన్మనిచ్చిన పలువురు బాలింతలకు సబ్‌కలెక్టర్ బేబీ కిట్లను, జన్మదిన ధ్రువీకరణ పత్రాలు, సుకన్య సమృద్ధి యోజన ధ్రువీకరణ పత్రాలు, పోషణ మెనూను, టీకా పట్టిక తెలిపే పోస్టర్‌ను అందజేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ఏసీడీపీఓ దొడ్డా నాగేశ్వరి, కౌన్సిలర్ కొప్పుల ప్రదీప్ పాల్గొన్నారు.

మేడూరు ఆలయంలో వంటగది ప్రారంభం

దాత విరాళం రూ.5 లక్షలతో నిర్మాణం



వంటగదిని ప్రారంభిస్తున్న దాత సుబ్బారావు దంపతులు

మేడూరు(గంపలగూడెం): గంపలగూడెం మండలంలోని మేడూరు వీరాంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం ఒక భక్తుడి విరాళంతో నిర్మించిన వంట గదిని దాత చేతుల మీదుగా ప్రారంభించారు. ఆలయ ప్రాంగణంలో ఆర్యవైశ్య ప్రముఖులు గంపలగూడెం వర్తక సంఘం అధ్యక్షుడు చారుగుండ్ల వెంకట సుబ్బారావు రూ.5 లక్షల ఖర్చుతో వంటగది నిర్మాణం, అవసరమైన వంట సామాన్లను ఏర్పాటు చేశారు. ఈ క్రమలో దాత దంపతులు చారుగుండ్ల సుబ్బారావు, సరస్వతి వంటగదిని ప్రారంభించారు. ఆలయ అర్చకులు కోమండూరి రామచంద్రాచార్యులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ ముత్యాల రామకృష్ణ, వెంకటేశ్వరస్వామి దేవస్థానం అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, ఈఓ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఎస్టీలకు అండగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం



లబ్ధిదారులకు మ్యాచింగ్ గ్రాంట్ చెక్‌ను అందజేస్తున్న గంగాధరరావు

చంద్రాల(మైలవరం): ఎస్టీ యానాది కులస్తులకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అండగా నిలిచి, వారు సొంత ఇళ్లు నిర్మించుకునేందుకు సహకరించడం సంతోషదాయకమని, వైఎస్సార్ రైతు విభాగం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు జొన్నలగడ్డ గంగాధరరావు, గ్రామ సర్పంచ్ జ్యోతి తెలిపారు. మైలవరం మండలం చంద్రాల గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సర్పంచ్ మాట్లాడుతూ గ్రామానికి చెందిన 14 మంది యానాది కులస్తులకు సొంత ఇళ్లు నిర్మించుకునేందుకు జగనన్న కాలనీ కింద స్థలాలు కేటాయించినట్లు తెలిపారు. వీరు ఇళ్లు నిర్మించుకునేందుకు ట్రైబల్ వెల్ఫేర్ నుంచి మ్యాచింగ్ గ్రాంట్ ద్వారా ఒక్కొక్కరికి అదనంగా రూ.63 వేలు మంజూరు కాగా రెండో విడతగా రూ.1.03 లక్షలు చెక్‌ను గంగాధరరావు ద్వారా లబ్ధిదారులకు అందజేసినట్లు సర్పంచ్ తెలిపారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



వరాహ పుష్కరిణి మెట్లపై పిచ్చి మొక్కలను తొలగిస్తున్న ఉపాధి కూలీలు

ఆగిరిపల్లి: గ్రామాల్లోని పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యతని ఎంపీడీఓ కె.వాణి అన్నారు. స్థానిక పురాతన శోభనాచల వ్యాఘ్రలక్ష్మీ నరసింహస్వామి ఆలయ వరాహ పుష్కరిణి (మెట్లకోనేరు) మెట్లపై ఉన్న పిచ్చి మొక్కలను తొలగించే కార్యక్రమాన్ని శుక్రవారం చేపట్టారు. ఇటీవల వరాహ పుష్కరిణి పూడికతీత పనులకు ఉపాధి హామీ పథకంలో చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. దీనిపై అసిస్టెంట్ కలెక్టర్ పుష్కరిణిని పరిశీలించి నివేదికను కలెక్టర్‌కు సమర్పించారు. దీనిపై కలెక్టర్ పుష్కరిణి మెట్ల చుట్టూ ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలు, మెట్ల చుట్టూ పిచ్చి మొక్కలను తొలగించి, పుష్కరిణి పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. దీంతో 250 మంది ఉపాధిహామీ కూలీలతో పారిశుధ్య పనులు నిర్వహించారు. సర్పంచ్ లక్ష్మి, ఆగిరిపల్లి–2 ఎంపీటీసీ సాదం గోపీనాథ్, పంచాయతీ కార్యదర్శి బి.ప్రసాద్, ఫీల్డ్ అసిస్టెంట్ రాణి పాల్గొన్నారు.

చదరంగంలో విద్యార్థులకు శిక్షణ



తిరువూరు గ్రంథాలయంలో చదరంగం శిక్షణ

తిరువూరు: స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు శుక్రవారం కొనసాగాయి. జిల్లా గ్రంథాలయ సంస్థ నిర్దేశించిన షెడ్యూలు మేరకు విద్యార్థులకు చదరంగంలో శిక్షణ ఇచ్చారు. పుస్తక పఠన ఆవశ్యకతను గ్రంథాలయాధికారి పద్మావతి వివరించారు. తెలుగు భాషలో గ్రామర్ ప్రాధాన్యతను తెలుగు భాషా వికాస సమితి అధ్యక్షుడు తోట ఉమామహేశ్వరరావు తెలియజేశారు. సైన్స్ సబ్జక్టులో ముఖ్యాంశాలను జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయిని భరతకుమారి విద్యార్థులకు వివరించారు.

నీతి కథల పఠనంపై అవగాహన

ఆగిరిపల్లి: స్థానిక ఆగిరిపల్లి గ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా శుక్రవారం విద్యార్థులకు నీతి కథలు చెప్పటం, చదివించటంపై అవగాహన కలిగించారు. విద్యార్థులు హాజరై తమంతట తాము కథలను చెప్పటం, చదవడంపై శిక్షణ పొందారు. గ్రంథాలయాధికారి నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

చాట్రాయిలో..

చాట్రాయి: మండలంలోని చనుబండ, చాట్రాయి గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు ఉత్సాహ పూరిత వాతావరణంలో నిర్వహిస్తున్నారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. శుక్రవారం పుస్తక పఠనం, గణితం, ఇంగ్లీషుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారుల శ్రీకాంత్, మణికంఠలు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మధురానగర్(విజయవాడసెంట్రల్): నటరత్న ఎ న్టీఆర్ శతజయంతి సందర్భంగా ఆల్‌దిబెస్ట్ ఆర్ట్స్ అకాడమీ సాహిత్య సాంస్కృతిక సామాజిక సేవా సంస్థ ఆధ్వర్యాన పలు రంగాలలో సేవలు అందిస్తున్న ప్రతిభావంతులను గుర్తించి ఎన్టీఆర్ సేవా రత్న, కళారత్న పురస్కారాలను అందించేందకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు అకాడమీ స్థాపక అధ్యక్షులు డాక్టర్ కేఎస్ఎస్ నారాయణ మాష్టార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈనెల 20లోపు దరఖాస్తులు పంపాలని ఇతర వివరాలకు 96523 47207 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.